క్లుప్తంగా

ఘనంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) వీరభద్రస్వామి మూల విరాట్

పెద్దవడుగూరు: మండల కేంద్రం సమీపంలోని నల్లగుట్ట వద్ద నూతనంగా నిర్మించిన వీరభద్ర స్వామి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ట బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజ, శిఖర ప్రతిష్ట, కూష్మాండబలి, పూర్ణాహుతి, కుంభాభిషేకం, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేలాది మంది తరలిరావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు వసతులను కల్పించారు. అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

డ్రైనేజీల్లో పూడికతీత



డ్రైనేజీలో పూడిక తీయిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని మదీనా కాలనీలో బుధవారం ఈఓ సీ అశ్వర్థనాయుడు ఆధ్వర్యంలో డ్రైనేజీలో పూడికతీత చేపట్టారు. ఇటీవల మదీనాకాలనీలో 'డ్రైనేజీ అస్తవ్యస్తం' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈఓ జేసీబీతో డ్రైనేజీలో పూడిక తీయించారు. దీంతో నిల్వ ఉన్న మురుగునీరు ముందుకు సాగడంతో దుర్గంధం బాధ తప్పింది. సరస్వతీ ఉన్నత విద్యామందిరం కాలనీ, మదీనా కాలనీవాసులు సాక్షికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు యర్రగుంట్ల విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గార్లదిన్నె: యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం గురుకుమార్ బుధవారం తెలిపారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్వేత ఇటీవల అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన అండర్-19 ఏపీ స్కూల్ గేమ్స్ 800 మీటర్ల పరుగు పందెంలో అత్యంత ప్రతిభ కనబరిచిందన్నారు. దీంతో నిర్వాహకులు ఆమెను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 13న పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈసందర్భంగా హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థిని శ్వేత, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌ను అభినందించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ధర్నా

గుంతకల్లు: కల్తీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం రాజేంద్రనగర్‌లోని ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ గుంతకల్లు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ఇటీవల పట్టణంలోని ఓ మద్యం షాపులో కల్తీ మద్యం సేవించి మృతి చెందిన బేల్దారు పెద్దన్న కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పార్టీ శ్రేణులు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వద్దకు చేరుకోవాలని కోరారు.

15న ఎస్ఆర్ఐటీలో జాతీయ సదస్సు



కళాశాలలో పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 15న జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నెక్స్ట్ జెన్ 2కే-25 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి కళాశాల చైర్‌పర్సన్ జొన్నలగడ్డ పద్మావతి, కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి హాజరవుతారన్నారు. సాంకేతిక విప్లవాలను వెలికి తీసేలా ఈ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హేమంత్‌కుమార్, డాక్టర్ చిత్రలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

పనులు ఆపి.. సమస్యలు నింపి

- వివేకానంద స్కూల్‌లో ఆగిన నాడు-నేడు పనులు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



తరగతి గదిలో మూలన ఉన్న సిమెంట్ బస్తాలు



తరగతి గది పైకప్పునకు వైట్ వాష్ చేయించకుండా వదిలేసిన దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హంపయ్యకాలనీలో ఉన్న స్వామి వివేకానంద మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కారీ బడుల రూపురేఖలను మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు-నేడు పథకాన్ని కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా ఆపేయడంతో సమస్యలు తిష్ట వేశాయి. పాఠశాలలో మొత్తం 56 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం పాఠశాలలో ముగ్గురు టీచర్లు ఉండాలి. కానీ ప్రస్తుతానికి హెచ్ఎం మాత్రమే ఉన్నారు. మిగిలిన ఒక ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై ఇక్కడికి పంపినప్పటికీ ఆయన మెడికల్ లీవ్‌లో ఉండటంతో పిల్లలకు బోధన ఇబ్బందిగా మారింది.

కనీస సౌకర్యాలు కరువు..

పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. అవసరమైన మేర టాయిలెట్లు లేవు. దీంతో అబ్బాయిలు యూరినల్స్‌కు బయటికి వెళ్తున్నారు. తాగునీటి వసతి లేకపోవడంతో మధ్యాహ్న భోజన వేళ తాగడానికి తమ ఇళ్ల నుంచి వాటర్‌బాటిల్స్‌లో నీరు తెచ్చుకుంటున్నారు. పాఠశాల టాయిలెట్ల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. గతంలో ఇదే స్కూల్‌లో పాములు తిరుగుతుండటంతో గమనించిన స్థానికులు వాటిని పట్టించారు.

ఎక్కడి పనులు అక్కడే..

మన బడి నాడు-నేడు పథకం రెండో విడత కింద రూ.8.77 లక్షలు విడుదలయ్యాయి. కాంపౌండ్ వాల్ మినహా మిగిలిన పనులన్నీ సగం చేసి వదిలేశారు. తరగతి గదుల పైకప్పుకు అక్కడక్కడ ప్లాస్టరింగ్ చేసినప్పటికీ కనీసం వైట్ వాష్ కూడా చేయించలేదు. ఎప్పుడు పెచ్చులూడుతాయో కూడా తెలియని పరిస్థితి. టాయిలెట్లు మొండిగోలకే పరిమితమయ్యాయి. సిమెంట్ బస్తాలను వినియోగించకపోవడంతో గడ్డకట్టుకుపోయాయి. టాయిలెట్లల్లో బిగించాల్సిన శానిటరీ సామగ్రి మొత్తం మూలనపెట్టేశారు. హ్యాండ్‌వాష్ కట్ట నిర్మించినప్పటికీ కొళాయిలు బిగించలేదు. నీటి సంపు వినియోగంలో లేదు. ఆటస్థలం మొత్తం కంకర రాళ్లతో నిండింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిపేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.





మొండిగోడలకు పరిమితమైన టాయిలెట్లు, కుళాయిలు బిగించకుండా వదిలేసిన హ్యాండ్‌వాష్ కట్ట

అనుమతి రాగానే పనులు చేయిస్తాం

మనబడి నాడు-నేడు కింద గతంలో విడుదలైన నిధుల్లో రూ.1.50 లక్షల దాకా డబ్బు స్కూల్ ఖాతాలో ఉంది. అయితే ఆ నిధుల వినియోగానికి ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే అర్ధంతరంగా ఆగిపోయిన పనులు పూర్తి చేయిస్తాం.

– నామేనాయక్, పాఠశాల హెచ్ఎం

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గుడ్డాలపల్లిలో మాట్లాడుతున్న అధికారులు

గార్లదిన్నె: పశు పోషకులు పశుగర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం గుడ్డాలపల్లిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకటేష్, పశుశాఖ డీడీ డాక్టర్ రమేష్‌రెడ్డి 54 పాడి పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడాదికి ఒక దూడ పుట్టాలంటే పశువు ఈనిన 60 రోజుల్లోపు ఎద సూది వేయించుకోవాలన్నారు. కేవలం పెయ్య దూడలు మాత్రమే పుట్టే వీర్యం ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోందని తెలిపారు. ఎదకు రాని పశువులు, ఎన్నిసార్లు ఎద సూది వేసినా కట్టని పశువులను వైద్య శిబిరానికి తీసుకొచ్చి ఉచితంగా వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో శింగనమల ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ డాక్టర్ పద్మనాభం, గార్లదిన్నె, పెద్దవడుగూరు పశువైద్యాధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న సీపీఐ నేతలు

బుక్కరాయసముద్రం: అనంతపురం గుత్తి రహదారి వద్ద తడకలేరు సమీపంలో సర్వీస్ రోడ్డు లేకుంటే ప్రజలు రాకపోకలు ఎలా సాగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం గుత్తిరోడ్డు సమీపంలోని తడకలేరు వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ అనంతపురం గుత్తి రహదారిపై తడకలేరు వద్ద నుంచి రాఘవేంద్ర కాలనీ, కొట్టాలపల్లి, బోయ కొట్టాల, బీజేపీ కాలనీ, గోవిందపల్లి, భద్రంపల్లికి వెళ్లేందుకు సర్వీసు రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో రహదారి కాంట్రాక్టర్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకులు రామాంజి, ఆనంద్ కుమార్, సుంకన్న, భాస్కర్, శీన, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన బొంబాయి రమేష్‌నాయుడు



వైఎస్ జగన్‌ను కలిసిన బొంబాయి రమేష్‌నాయుడు, అవుకు నాగరాజు, శశిధర్

యాడికి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఎస్ఈసీ సభ్యుడు బొంబాయి రమేష్ నాయుడు,ఎంపీటీసీ అవుకు నాగరాజు, నాయకుడు శశిధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టత కోసం క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమను ఆదేశించినట్లు వారు తెలిపారు.

చీనీలో ఆధునిక పద్ధతులు పాటించండి

- ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి



యర్రగుంట్లలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ జేడీ దేవమునిరెడ్డి, అధికారులు

శింగనమల / గార్లదిన్నె: చీనీ సాగులో రైతులు ఆధునిక పద్ధతులను పాటించాలని ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవమునిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వెంకటగిరి చీనీ, నిమ్మతోటల పరిశోధన కేంద్రం శాస్త్ర వేత్త, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారులు ఉమాదేవి, రత్నకుమార్‌తో కలిసి శింగనమల మండలం ఈస్ట్ నరసాపురం, సోదనపల్లి, మట్లగొంది, గార్లదిన్నె మండలం మర్తాడు, యర్రగుంట్లలో చీనీ తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులకు నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తోటల్లో గడ్డి తొలగింపు కోసం గ్లైఫోసేట్ మందు పిచికారీ చేస్తున్నారని దీంతో చీనీ తోటల వయస్సు 25 సంవత్సరాల నుంచి 10నుంచి 12 సంవత్సరాలకు తగ్గిపోతుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా కలుపు షీట్లు వాడాలన్నారు. వివిధ చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమాల్లో బుక్కరాయసముద్రం ఉద్యాన అధికారి శైలజ, గార్లదిన్నె ఉద్యాన విస్తరణ అధికారి రామాంజనేయులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కార్పొరేట్ సెలూన్‌షాపులను తొలగించండి

గుంతకల్లుటౌన్: కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నాయీబ్రాహ్మణుల కడుపుకొట్టేలా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్‌షాపులను తీసివేయించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను క్షౌర రవృత్తిదారుల సంఘం నాయకులు కోరారు. మంగళవారం రాత్రి గుత్తికి విచ్చేసిన మంత్రిని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బ్రహ్మ తదితరులు కలిసి విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కులస్తులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలియజేశారు.

ఎస్సీ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించండి

గుంతకల్లు: స్థానిక హనుమేష్‌నగర్‌లోని ఎస్సీ బాలికల వసతిగృహాల్లో(నం.1,2) నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ హరిప్రసాద్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. హాస్టల్‌లోని సెప్టిక్ ట్యాంక్ పూర్తిగా నిండి బ్లాక్ కావడంతో విద్యార్థులు ఉపయోగించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. చుట్టుపక్కల కాలనీ ప్రజలు చెత్తాచెదారం హాస్టల్ పరిసరాల్లో వేయడంతో దోమలు ప్రబలి రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సామాజిక కార్యకర్త డాక్టర్ ప్రభాకర్ ఉన్నారు.

సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీపీఎం సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో 28వ చైతన్య మండల సమాఖ్య మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షురాలిగా వెంకటేశ్వరమ్మ ఎన్నికయ్యారు. వెలుగు ఏపీఎం అనిత, బ్యాంక్ లింకేజీ ఏపీఎం సుభద్రమ్మ సీపీలు, గ్రామైక్య సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్పీ సారూ న్యాయం చేయండి'

బుక్కరాయసముద్రం: చోరీ ఘటనలో తమకు న్యాయం చేయాలని బాధితులు అనీల్‌కుమార్, అశోక్ బుధవారం జిల్లా ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5న బీకేఎస్ మండలం దక్షిణామూర్తి నగర్‌లో చోరీ జరిగిందన్నారు. వీటిలో 7 తులాల బంగారం, రూ.లక్ష నగదు దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. దీనిపై బీకేఎస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయితే పోలీసులు చోరీ ఘటనలో రూ.2 లక్షల విలువైన బంగారం మాత్రమే పోయినట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారని వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు..గుంతకల్లుకు చెందిన శ్రీరాములు, వీరన్న గుత్తిలో పని ముగించుకుని బైక్‌పై తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలో ముందు వెళుతున్న ఆటో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో బైక్ ఆటోను ఢీ కొనింది. దీంతో బైక్ కింద పడింది. ప్రమాదంలో గాయపడిన శ్రీరాములు, వీరన్నను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

ఫిట్‌లైన్లు ఏర్పాటు చేయాలని వినతి

గుంతకల్లు: స్థానిక తిమ్మనచర్ల రైల్వేస్టేషన్‌లో ఫిట్‌లైన్లు ఏర్పాటు చేసి పట్టణాభివృద్ధికి సహకరించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీ.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సీపీఐ నాయకుల బృందం డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్‌లో రైల్వే ఖాళీ స్థలం ఉందని, అక్కడ 5 ఫిట్‌లైన్లను ఏర్పాటు చేయడం ద్వారా గుంతకల్లు జంక్షన్‌కు మరిన్ని ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు రావడంతోపాటు బోగీలు శుభ్రం చేసేందుకు కొంతమందికి ఉపాధి అవకాశాలు దొరకుతాయన్నారు. హనుమస్ సర్కిల్ ఎల్‌సీ గేట్ వద్ద దెబ్బతిన్న రోడ్డును అభివృద్ధి పరచడంతోపాటు కసాపురం రైల్వే వంతెనను విస్తరించాలని కోరారు. సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు బీ.గోవిందు, పట్టణ, మండల కార్యదర్శులు గోపీనాథ్, రాముర్యాయల్ ఉన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

గార్లదిన్నె/ పామిడి : మా గార్లదిన్నె మోడల్ స్కూల్, పామిడి మండలం ఎద్దులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్, యూనిసెఫ్ కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ వీరాంజనేయులు విద్యార్థులకు మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలో తెలియజేశారు. అనంతరం ఎద్దులపల్లిలో విద్యార్థుల తో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు యాస్మిన్ తాజ్, ప్రహల్లాద్ , పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్లూరు సీఐకి ప్రశంసాపత్రం



ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ సత్యబాబు

పుట్లూరు: ఉత్తమ సేవలను అందిస్తున్న సీఐ సత్యబాబు బుధవారం జిల్లా ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. మండలంలో చోరీ సొత్తు రికవరీ, శాంతి భద్రతలపై ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఎస్పీ తన కార్యాలయంలో సీఐకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

యాడికి: స్థానిక పోలీస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు నరేంద్ర రెడ్డి, శివ, రాజు జిల్లా ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా బుధవారం ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకుగాను ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు వారు తెలిపారు. వారిని యాడికి సీఐ ఈరన్న, ఎస్ఐ రమణయ్య అభినందించారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ

శింగనమల: అలంకరాయునిపేట గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి బుధవారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి యత్నం హేయం



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తాడిపత్రి రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బీఆర్ గవాయ్‌పై సీనియర్ న్యాయవాది దాడికి యత్నించడం హేయమని తాడిపత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి పేర్కొన్నారు. సీజేఐపై దాడి యత్నానికి వ్యతిరేకంగా బుధవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కుమారస్వామి, సీనియర్ న్యాయవాదులు దద్దం సుబ్బయ్య, సదాశివారెడ్డి, చక్రపాణి, రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మురళి, సతీష్, మౌర్య, జీవన్, ఫరీదా, మధువీణ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఇది చీకటిదినంగా భావిస్తున్నామని, ఈ ఘటనతో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదమని చెప్పారు. బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు జామిని, పట్టణాధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు సుధాకర్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్

గుత్తి రూరల్: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై బుధవారం మండల మహిళ సమాఖ్య సభ్యులకు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ అవగాహన కల్పించారు. ధరలు తగ్గిన వస్తువుల వివరాలతో కూడిన కరపత్రాలను గ్రామాల్లో ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని సూచించారు. దుకాణదారులు తగ్గిన ధరలతో విక్రయించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అరుణకుమారి, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, కస్తూర్బా పాఠశాలలో బుధవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీ మేరకు వస్తువులు కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు, చదువురాని వారికి తెలియజేయాలన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మీనాక్షి, కస్తూర్బా ఎస్ఓ రుద్రాక్ష తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో పాముకాటు వేయడంతో లక్ష్మి అనే మహిళ రైతు తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన లక్ష్మి తన ఇంటి బయట ఉన్న తోటలో కొన్ని మొక్కలు వేసింది. బుధవారం తోటలో కలుపు మొక్కలు తొలగిస్తుండగా మొక్కల కింద ఉన్న పాము లక్ష్మి కాలికి కాటు వేసింది. నొప్పిగా ఉండటంతో లక్ష్మి వెంటనే విషయం కుటుంబసభ్యులకు తెలిపింది. దీంతో లక్ష్మిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించి 24 గంటల పాటు పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

పామిడి: మండలంలో పంటలు సాగు చేసిన ప్రతిరైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. బుధవారం వంకరాజుకాలువ, సొరకాయలపేట, ఎద్దులపల్లి, పాళ్యం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈనెల 25 వరకూ ఈ క్రాప్ నమోదుకు గడువు ఉందని, అన్నదాతలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ విజయకుమార్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైల్వేగేటు.. తప్పని ఫీటు

- ప్రతిపాదనలకే పరిమితమైన బ్రిడ్జి నిర్మాణం
- వాహనదారులకు తప్పని అవస్థలు



రైల్వేగేటు పడటంతో ఫీట్లు చేస్తున్న వాహనదారులు



పొలాల మీదుగా వెళ్తున్న వాహనదారులు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న రైల్వేగేటు ప్రతి 15 నిమిషాలకు ఒక్కసారి పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు నుంచి తిరుపతి, చెన్నై ప్రధాన రైల్వే మార్గం కావడంతో రైళ్ల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. అలాగే పట్టణం కూడా పుట్లూరు రోడ్డుకు విస్తరించడంతో పాటు ఆటోనగర్, ఆర్‌డీటీ కాలనీతో పాటు డిగ్రీకళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు , పలు కల్యాణ మండపాలు ఉండటంతో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో రైల్వేగేటు కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గేటు పడిన ప్రతిసారి వాహనదారులు సమీపంలోని పొలాల గుండా వెళ్లి వంక కాలువలో బైపాస్ రోడ్డుకు చేరుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మరి కొంత మంది పడిన గేటు కింద ఫీట్లు చేసుకుంటూ వెళ్తున్నారు. తాడిపత్రి బైపాస్ రోడ్డును కలుపుతూ దాదాపు రూ.30 కోట్ల అంచనాలతో ఇక్కడ రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయి. అయితే బ్రిడ్జి నిర్మాణం ప్రతి పాదనలకే పరిమితం కావడంతో వాహనాదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.